# ఏనుగు అను ఓ అమ్మోరి కథ

గంటి భానుమతి

ఇంకా బాగా తెల్లారలేదు. చీకటి చీకటిగా వుంది. ఆ సమయాన పచ్చటి పట్టు చీర, ఒంటినిండా నగలు, నీళ్ళు కారుతున్న జుట్టుతో గబగబా పెరట్లోని బాత్రూము దగ్గరకెళ్ళి తలుపుకొట్టింది వీరమ్మ.

"అమ్మగారు! స్నానం అయిపోతే వచ్చేయండి. అంతా మీ రాకకోసం ఎదురు చూస్తున్నారు"

ఒక్క సెకండు తర్వాత తలుపులు తెరుచుకున్నాయి. అమ్మగారు బయటికొచ్చి, ఎడంవైపుకి చూశారు.

చెట్లకి నీళ్ళు పెడ్తున్న వెంకటేసు, అదే సమయానికి చూసాడు.

వీరమ్మ విసుగ్గా వెంకటేసు వైపు చూసి 'నీ పని చేసుకో' అన్నట్లు చెయ్యి ఊపి నడిచింది యింటివైపు.

అమ్మగారు మౌనంగా వీరమ్మ వెనకాలే వెళ్లారు. అమ్మగారికి ఎర్రటి పట్టు చీర, నగలు వడ్డాణం అదీ పెట్టి అలంకరించింది. పిలుపు వచ్చాకా అమ్మగారు భక్తులంతా వున్న హాల్లోకి వెళ్లి ఆసీనులవుతారు. అదీ రోజూ జరిగేదే.



ఆ పక్కగానే వున్న హాలు పెద్ద లైట్లతో పట్టపగలులా వుంది.

భజనలు అవుతున్నాయి. గంటలు మోగుతున్నాయి.

వీరయ్య, తన ఎర్ర బరంపురం పంచని, పైన వున్న పట్టు వస్త్రాన్ని సవరించుకుంటూ చేతిలో వున్న పూల సంచిని, ఓ పక్కగా వున్న ముత్తయిదువులకిచ్చి దండలు చెయ్యమని సైగచేశాడు.

ఆ హాల్లో ఓ వైపున తెర వుంది. అది సంత్రా రంగులో వున్న సిల్కు బట్టతో కుట్టినది.

ఆ తెర లాగారు.

వెండికాళ్ళున్న పీఠం మీద కూచున్న అమ్మగారు అందరికీ దర్శనమిచ్చారు.

భజన జోరు హెచ్చింది.

''అయ్యగారు'' అన్నాడు వీరయ్య.

వివిధ ఆకారాల్లో వున్న హారతి పళ్ళాల్ని నేత వత్తుల్తో అలంకరిస్తున్నాడు. చేస్తున్న పని ఆపి వీరయ్యవైపు చూశాడు ఆ అయ్యగారు.

'' ఈరోజు శుక్రవారం. భక్తులు ఎక్కువమంది వస్తారు. దర్శనం మొదలెట్టాకా మనిషికి ఐదు నిమిషాల కన్నా ఎక్కువ యివ్వద్దు''

''అలాగేనండి'' అన్నాడు.

వీరయ్య పిలిచిన అయ్యగారు, నిజానికి వీరయ్య కొడుకు. పూర్వనామం భిక్షపతి.

ఓ నల్లప్యాంటు, ఓ ఎర్ర టీషర్టు, లేకపోతే అడ్డచారల టీషర్టుతో సంజయ్‌దత్ లాంటి జులపాల జుట్టుని నీళ్ళు వేసి దువ్వి యింటినుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో వున్న ఆడపిల్లల స్కూలు దగ్గర కాసేవాడు.

అది ఒకప్పుడు.

ఇప్పుడు- కార్డంచు జరీ పంచ, పిలక, నుదుట వీబూతి... గంభీరంగా తనపని చేసుకుపోతున్నాడు. కారణం కొత్త అవతారం.

అమ్మగారు అనబడే ఆమె వీరయ్య పెద్దకూతురు శారద.

ఆమె పుట్టినపుడు బాధపడ్డ తలిదండ్రులు యిప్పుడు వాళ్ళ అదృష్టానికి సంతోషపడ్తున్నారు. వాళ్ళ చీదరింపులు, ఛీత్కారాలు భరించి, బదులుగా కోటి వరాలిస్తోంది. ఆమె ఓ కల్పవృక్షం. ఆమె ఓ కామధేనువు.

ఈనాటికీ వీరయ్యకి బాగా గుర్తు... శారద పుట్టిన రాత్రి.. ఆ రాత్రి పెద్ద గాలీ, వానా...

వీరమ్మ గదిలో నొప్పులు పడ్తాంటే వీరయ్య బయట బీడి తాగుతూ పచార్లు చేస్తున్నాడు.

'కేర్' మన్న ఏడుపు.

లోపలికెళ్ళి చూశాడు ఆతృతగా.

అస్తవ్యస్తంగా వున్న వీరమ్మ పక్కన బిడ్డ.. ఆడపిల్ల.. సన్నగా చేతివేళ్ళంత సన్నగా కాళ్ళు చేతులు, పెద్ద తల, కప్పలాగా ఉబ్బిన కళ్ళు.

తల పట్టుకున్నాడు వీరయ్య.

వీరయ్యలోని శక్తి అంతా ఆ పురుటి కందు లాగేసింది.

''వీరయ్యా! ఏం బాధపడకు. ఇలాంటి పిల్లలు రోజుల్లెక్కపెట్టు జీవిస్తారు''

ఆరోజునుంచి పిల్లపోయింది అనే మాటల కోసం ప్రతిరోజూ ఎదురుచూడ్డం మొదలెట్టాడు.

అయితే నిరాశే మిగిలింది.

రోజులు గడుస్తున్నాయి. నెలలు గడిచాయి. ఏళ్ళు వెళ్తున్నాయి. శారద తర్వాత ముగ్గురు పిల్లలు పుట్టారు. వాళ్ళంతా బాగున్నారు. అందరూ కూడా సరిగ్గా, సహజంగా పెరుగుతున్నారు. కానీ శారద మాత్రం అలాగే ఏ మాత్రం ఎదుగూ బొదుగూ లేకుండా వుండిపోయింది. వీరయ్య, వీరమ్మ శారదని అసహ్యించుకున్నా, నిస్సహాయంగా పెంచుకుంటున్నారు.

అలాంటి సమయంలో ఓరోజు పంచాయితీ టీవీలో వాళ్ళ సమస్యకి పరిష్కారం దొరికింది.

నేపాలులో ఓ కన్యని, దేవతలాగా అలంకరించి ఊరేగించడం.

ఊపిరి పీల్చుకున్నాడు.

రెండురోజులు వీరయ్య, వీరమ్మ మంతనాలు జరిపారు.

కూతురు శారదని పిలిచారు. పదేళ్ళ శారద నాలుగేళ్ళ అమ్మాయిలాగా వుంది. పొట్టిగా.. సన్నగా..

''ఇవ్వాళ నుంచి నీపేరు అమ్మ. అమ్మగారు. అమ్మోరు, అర్థం అయిందా. మేం కూడా అలాగే పిలుస్తాం. నేనేం చెప్తానో అదే చెయ్యి. నోరెత్తకు. చెయ్యకపోతే ఏం చేస్తానో.. చూసుకో...''

మూడేళ్ళ పిల్లలాగే భయపడింది. అసలే పొడుచుకొచ్చిన కళ్ళు. భయంతో యింకా పెద్దగా చూసేటప్పటికీ వీరయ్యకే భయం వేసింది.

యింట్లో వాళ్ళకి బోల్డు డబ్బు, ఆస్తి, నగలు సంపాదించి యిచ్చింది. అందరి జాతకాలు మార్చేసింది. యింటిని మార్చేసింది. మూడంతస్తుల బంగళా లాగా మార్చేసింది. రాతలు మార్చేసింది.

నాలుగు రోజులు శారదకేం చెయ్యాలో చెప్పారు. నేర్పించారు.

వార్త వ్యాపించడం మొదలెట్టింది.

''మా పిల్ల అన్నం తినదు. నిద్రపోవడం లేదు. మాట్లాడ్డం మానేసింది. ఎప్పుడు చూసినా దేవుడి పటం ముందు కూచుని తనలో తనే మాట్లాడుకుంటుంది. ఎంతో భయంగా వుంది'' అంటూ ఇరుగమ్మకి పొరుగమ్మకి చెప్పి వాళ్ళ నోటితోనే శారదని అమ్మవారు ఆవహించింది అన్న ప్రచారం చేయించారు.

నిజమో కాదో చూద్దామని ఊళ్ళోవాళ్ళు రావడం, వచ్చాకా ఆశ్చర్యపడడం. ఆకారం చూసి వయసు అంచనా వెయ్యలేకపోయారు. ఇంత చిన్నపిల్లకి ఇంత నిష్ఠ ఏమిటనుకున్నారు. ఈ జ్ఞానం ఎలా వచ్చిందబ్బా! అంతా దేవత మహత్యం అనుకున్నారు.

రోజు రోజుకి సంఖ్య ఎక్కువవడం మొదలయింది.

సమయం చూసుకుని ఊగిపోయేది. భయంతో దూరం వెళ్ళిపొయ్యేవారు. వీరయ్య, వీరమ్మ వేపమండలు ఊపుతూ శాంతించమని వేడుకునేవారు. కొబ్బరికాయలు కొట్టేవారు. గుమ్మడికాయలు కొట్టేవారు. నీరసంగా శారద పడిపోయేది. పళ్ళరసం యిచ్చి మామూలు మనిషిని చేసేవారు.

శారద అమ్మోరి అవతారం అని అందరూ నమ్మారు.

పక్క ఊళ్ళ వాళ్ళకి తెలిసింది.

మొదట్లో ఏవిటో చూద్దామని ఉత్త చేతులతో వచ్చినా, రాను రాను ఏదో ఒకటి తెచ్చి యివ్వడం మొదలెట్టారు.

కొంతమంది ఏవో ప్రశ్నలు వేసేవారు. తోచినది చెప్పేది. దానికే అంతా ఎంతో తృప్తిగా వెళ్ళిపోయేవారు.

ఇంటి వాతావరణంలో మార్పు, భాషలో మార్పు, వేషధారణలో మార్పులు వచ్చాయి.

వాళ్ళు, వీళ్ళు యిచ్చిన మిఠాయిలు, కొబ్బరికాయలు, పళ్ళు అందరికీ పంచేసేవారు. మంచి అభిప్రాయం ఏర్పడేలాగా ప్రవర్తించారు.

నిస్వార్థులని, మంచే చేస్తున్నారని అందరూ అభిప్రాయపడ్డారు. హారతిలో డబ్బులు వెయ్యడం మొదలెట్టారు. రోజుకి ఓ పది పదిహేను సార్లు హారతివ్వడం మొదలుపెట్టారు.

మంగళవారం, శుక్రవారం జనం బాగా రావడం మొదలెట్టారు. ఏ టైములో చూసినా, ఎవరు చూసినా కళ్ళు మూసుకుని వుంటుంది.

ఇటు ఖమ్మం అటు నల్గొండ మరో వైపు విజయవాడ ఈ మూడు జిల్లాలకి చేరువగా వుండటంతో, వచ్చినవాళ్ళు ఒక్కోసారి రాత్రికి వుండి పోయేవారు. పని అయిపోతే పెద్ద దూరాలు కాదుకాబట్టి వెళ్ళిపోయేవారు.

యిల్లు సరిపోక, యింటిముందు తాటాకుల పందిరి వేసారు. అదికూడా సరిపోలేదు. పక్కవాళ్ళున్న యిల్లు కొనేసారు.

యింటికి పక్కగా వున్న స్థలాన్ని పంచాయితి వాళ్ళని అడిగి చవగ్గా కొనేసాడు వీరయ్య. అక్కడ ఓ చిన్న హాలు కట్టించాడు. యింట్లోంచి ఓ తలుపు ఆ హాల్లోకి పెట్టించాడు.

వీరయ్య వీరమ్మలకి, భక్తుల్ని, వాళ్ళ కానుకల్ని సమర్థించడం కష్టం అయింది. ఆడపిల్లల స్కూలు దగ్గర కాపుకాసే పెద్దకొడుకు భిక్షపతికి పట్టం కట్టారు. జుట్టు తీయించుకున్నారు తండ్రీకొడుకులు. చిన్న పిలకలుంచుకున్నారు. పెద్దయ్యగారు, చిన్నయ్యగారుగా మారారు.


యింటికి దారితీసే రోడ్డు బాగయిపోయింది. రోడ్డు చివరన ఆగే బస్సుల్ని వీరయ్య యింటివరకూ లాగిస్తున్నారు.

వీరమ్మ పెద్దమ్మ అయింది. పెద్ద జరీ చీరలు, నగలతో హుందాగా మారిపోయింది.

శారదమ్మతల్లి అదే అమ్మోరులో ఏమార్పు లేదు. శరీరంలో మార్పులేదు. అంతే పొట్టి. అదే సన్నం. కాకపోతే, ప్రకృతి సహజమైన మార్పులొచ్చాయి. పద్దెనిమిదేళ్ళు వచ్చినా, పదేళ్ళమ్మాయిలా వుంది. హార్మోన్లు మటుకు వయసుకు తగ్గట్టుగా పనిచేస్తున్నాయి.

ఇంతమందిని సంతృప్తి పరిచింది.

యింట్లో వాళ్ళకి బోల్డు డబ్బు, ఆస్తి, నగలు సంపాదించి యిచ్చింది. అందరి జాతకాలు మార్చేసింది. యింటిని మార్చేసింది. మూడంతస్తుల బంగళా లాగా మార్చేసింది. రాతలు మార్చేసింది.



అయితే, ఆ అమ్మోరు తృప్తిగా వుందా.. అని ఒక్కసారయినా ఆ యింట్లో వాళ్ళు అనుకున్నారా?

అమ్మోరు మనసులో ఏముందో తొంగిచూశారా.. మనిషి వామనావతారమే.. కానీ మనసు..

మనిషి వికారంగా వుంటుంది.. కానీ.. కోరికలు..

ఎవరైనా వికారం భక్తులు కాళ్ళు గట్టిగా పట్టుకుని దండం పెట్టేసుకుంటూంటే, ఏదోలాగా అనిపించింది. గట్టిగా కళ్ళు మూసుకునేది విగ్రహాల్లో వుండిపోయిన అమ్మోర్ని తలుచుకుంటూ. మనిషి అందంగా లేకపోతేనేం అందమైన స్త్రీత్వం వుందిగా.

శరీర ధర్మాల్ని యథావిధిగా చేసుకుపోయే స్త్రీత్వం.

ఏవో కలలు, ఏవో కోరికలు.

అమ్మోరికి తెలుసు ఆమె కలల్ని, కోరికల్ని పెద్దమ్మ, పెద్దయ్యగారు నిజం కానీయ్యరు.

వాళ్ళకి ఆమె మింటింగ్ మెషీన్.

ఆమెమీద అధికారం ఆమెకి లేదు. పెద్దయ్యగారికి వుంది.

ఓరోజు-

వీరమ్మ బాత్రూం వైపు నడిచింది. అమ్మగారిని పిలవడానికి వెంకటేసు అక్కడే నుంచున్నాడు. వీరమ్మని చూసి అక్కణ్ణించి మెల్లగా వెళ్ళిపోయాడు. అనుమానంగా వాడివైపు చూసింది.

"అమ్మా! స్నానం అయితే బయటికొచ్చేయండి. భక్తులంతా వచ్చేసారమ్మా"

టక్కున తలుపు తీసి బయటికొచ్చింది శారద.. కాదు అమ్మోరు.

తడిజుట్టుని అలాగే వదిలేసింది.

ఎర్ర పరికిణీ, ఎర్ర పట్టు జాకెట్టు పైన ఎర్ర చీర చుట్టుకుని గదిలోకి వచ్చింది. వీరమ్మ ఆమెని నగలు అదీ వేసి అలంకరించింది. చీర అందంగా జరీ మడతలు వేసి కట్టింది.

గది తలుపులు తీసుకుని హాల్లో వున్న తన ఆసనం మీద కూచుంది.

పెద్దయ్యగారు పరదా తీశారు.

చిన్నయ్యగారు హారతి పళ్ళెం పట్టుకున్నారు.

భజన మొదలైంది.

భక్తుల్లో ఊపు మొదలైంది. అమ్మోరు కూడా ఊగడం మొదలెట్టింది.

గబగబా హారతి ఇచ్చారు.

"అమ్మ! తల్లి శాంతించు" అంటూ వేప మండలతో అమ్మోర్ని శాంతింప చేస్తున్నారు.

గబగబా కొబ్బరికాయలు కొట్టారు.

గంటలు గణగణా మోగించారు.

అమ్మవారు శాంతించారు. పక్కనే వుంచిన పళ్ళరసం తాగించారు. కళ్ళు మూసుకున్నారు.

"పేపరు వాళ్ళు వచ్చారమ్మా. ఇంటర్వ్యూ ఇస్తారా?"

మైకు దగ్గరికి పోయి గట్టిగా అనౌన్స్ చేసాడు. "అమ్మవారు ఇంటర్వ్యూ నిమిత్తం దర్శనాలు ప్రస్తుతం ఆపేస్తామని" తెర వేశారు.

కెమెరాతో ఓ యువకుడు, పుస్తకం పెన్నుతో మరో యువకుడు వెంటరాగా పెద్దయ్యగారు లోపలికి వచ్చారు.

"మీ పేరు"

"అమ్మవారు. అమ్మోరు" పెద్దయ్యగారి సమాధానం.

"అసలు పేరు"

"క్షమించాలి. అమ్మవారు మౌనవ్రతం. ఆవిడ ఎవరితో మాట్లాడరు. మీ ప్రశ్నలకి నేను జవాబిస్తాను"

"మీరెవరు"

"ఇహలోక బంధం అంటే తండ్రిని. లేకపోతే భక్తుణ్ణి"

"అలాగా! మీకెప్పుడు తెలిసింది మీ అమ్మాయిలో శక్తులున్నాయని.. అంటే.. అదే..."

"అంతకు ముందు రెండేళ్ళ నుంచి ఈ జిల్లాలో వర్షాల్లేక, పంటలు పండక ప్రజలు, రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్న సమయంలో అమ్మోరు పుట్టడం, వర్షాలు పడడం జరిగాయి. ఆ తర్వాత ఎప్పుడూ పూజలు చేయడం, ఎవరితో మాట్లాడక పోవడం, అమ్మోరు, అంత చిన్నగా వున్నా ఆవిడ అలా చేయడం అమ్మోరి మహిమ కాదాండి" వచ్చిన వాళ్ళకి అమ్మోరు వయసు అదీ తెలీదు.

'అబద్ధం' అంటూ అమ్మవారి హృదయంలోంచి ఆక్రోశం.

నాన్నా! అంతా అబద్ధం. నన్ను కురూపి, పొట్టి పిల్ల, శని, పిశాచం, దరిద్రం లాంటి మాటలతో నన్ను పొడిచేశావు. అప్పుడు నా గొప్పతనం గుర్తురాలేదా నాన్నా. యింత గౌరవం, భక్తి నామీద నీకు కలగడానికి కారణం మనిద్దరికీ తెలుసు. తెలియంది ఈ మూర్ఖలోకానికి.

"అమ్మగారి దినచర్య ఏమిటి?"

సూర్యోదయానికి ముందే లేవడం. అభ్యంగన స్నానం, కొంచెం పాలు, భక్తులకి దర్శనం, ఎక్కణ్ణించైనా లేఖలు వస్తే వాటికి జవాబులివ్వడం. భజనలు, సాయంత్రం దేవుళ్ళ మీద ప్రసంగాలు.

"మరి ఆవిడ అన్నం అదీ తినరా?"

"తిండి, నిద్రా ఆవిడకి ఆమడ దూరం. అవన్నీ మనలాంటి సామాన్యుల కోసం. అమ్మోరు వీటికి అతీతం. ఆవిడ శక్తి అలాంటిది.

అదుగో మరో అబద్ధం. నాన్నా! ఆకలికి ఆగలేక మొదట్లో అడిగి అడిగి విసిగిపోయాను. ఏడ్చేదాన్ని. తిని కూచుంటే లావయిపోతానని నీ భయం. కడుపులో ఏమీ లేకపోతే నిద్ర ఎలా పడ్తుంది? నాన్నా! నీకిది న్యాయమా. చెప్పు నాన్నా. నీ కూతుర్ని మాడ్చేస్తున్నావు. అన్నం తిననని అబద్ధం చెప్పకు. ఒక్కోసారి ఎంత ఆకలేస్తూందంటే మీరెవరూ చూడకుండా ఏదైనా తిందామా అని అనిపిస్తుంది. కానీ, ఏదో భయం.

ఫొటోలు తీసారు. ఆ వచ్చిన వాళ్ళు వెళ్ళిపోయారు. నీరసంతో కళ్ళు వాలిపోతున్నాయి. బలవంతంగా తెరిచింది. ఎదురుగా వెంకటేశ్ నుంచుని వున్నాడు.

ఏదో శమన. ఏదో ఊరట. ఎంతో హాయి.

కూచుని కూచుని తుంటి ఎముకలు తొడలు నొప్పి పెడ్తున్నాయి. కాళ్ళకింద వున్న చిన్న ముక్కాలి పీట మీద ఆనించింది.

వెంటకేశు అక్కడే వుండటం వాళ్ళకి నచ్చలేదు.

"ఉ" అని గట్టిగా అన్నాడు పెద్దయ్య.

అమ్మోరు కోపంగా పెద్దయ్యగార్ని చూశారు.

వెంకటేసు అక్కణ్ణించి వెళ్ళిపోయాడు.

చీకటి పడ్డాకా వచ్చిన వాళ్ళంతా వెళ్ళిపోయారు.

ఖమ్మం, నల్గొండ ఈ రెండు జిల్లాల దారిలో అమ్మోరు ఊరుండడం వల్ల వచ్చిన వాళ్ళు రాత్రిళ్ళు ఉండకుండా వెళ్ళిపోతున్నారు.

ఉన్నవాళ్ళు హాల్లో సర్దుకుంటున్నారు.

అమ్మవార్ని లోపలికి తీసుకెళ్ళిపోయారు. లోపలి గదిలోకి వెళ్ళాకా అమ్మవారు మామూలు ఆడపిల్లగా అయిపోయినట్లు అనిపించింది.

కొంచెం పళ్ళరసం, బాదం పిస్తాలు తిన్నాకా చల్లగాలికి గదిముందున్న లతా మండపం దగ్గర నుంచుంది. వెంకటేసు కోసం వెతికింది. వెంకటేసు వచ్చి ఆమెదగ్గర నుంచున్నాడు.

అదే సమయానికి స్నానం కోసం వచ్చిన భిక్షపతికి, పూజసామాను అంతా తెచ్చిన వీరమ్మకి ఏదో అర్థం అయినట్టుగా ఒకళ్ళ మొహాలు ఒకళ్ళు చూసుకున్నారు.

ఓసారి వెంకటేసు చెంపలు నివరడం, నిమురుతున్న ఆ చేతిని అమ్మోరు పట్టుకోవడం చూశారు.

వెంటనే అమ్మోర్ని లోపల గదిలోకి పిలిచి తలుపులు వేసి నిలదీశారు.

"ఏవిటీ వ్యవహారం? నీ మనసులో ఏవుంది?"

మౌనం.

"అమ్మగారు! ఇది తమరికి తగదు. మీరు అందరికీ అమ్మ. ఇలాంటి తుచ్ఛమైన విషయాలకి మనసు మళ్ళకుండా చూసుకోవాలి"

మౌనం.

"సాంసారిక కర్మల పట్ల ఉత్సాహం చూపకూడదు"

"ఎందుకు? నేనాడపిల్లను కానా? నాలో కోరిక లుండవా?"

"కానీ నువ్వు అమ్మవారివి"

"నేను అమ్మగార్ని కాదు. అయ్యగార్ని కాదు" విసురుగా మంచం మీద కూచుంది.

"హుష్! మెల్లగా మాట్లాడు" వీరమ్మ అమ్మోర్ని శాంతింపచెయ్యడానికి అంది.

మళ్ళీ మంచం మీదినుంచి లేచింది.

"ఎందుకు మాట్లాడాలి. ఎందుకు మెల్లిగానే మాట్లాడాలి. అందరూ వింటారని భయమా. వింటే విననీ.. అర్థం అవనీ. విన్నవాళ్ళందరికి తెలుస్తుంది నేనో మామూలు అమ్మాయినని. నాపేరు శారదని. నేను అమ్మోర్ని కానని అందరికీ చెప్తాను"

"నువ్విలా చెయ్యడానికి వీల్లేదు"

"నేనీ అవతారం వేసి వేసి, చేసి చేసి అలసిపోయాను. నేను అందరిలాటి మామూలు అమ్మాయిని"

"నీ లోపం నీకు తెలీదా?"

"నేను పొట్టిదాన్ని ఇదే నా లోపం. కానీ, ఈ లోపం ఆ వెంకటేసుకి ఎందుకు కనపళ్ళేదు. ఈ పద్దెనిమిదేళ్ళలో ఏ రోజునైనా, ఏ క్షణాన్నైనా నాతో ఆప్యాయంగా, ప్రేమగా మాట్లాడిన క్షణాలున్నాయా? ఈ వెంకటేసు నిరక్షరాస్యుడు కావచ్చు. మనదగ్గిర పనిచేసేవాడే కావచ్చు. కానీ నేను ఆడపిల్లను అన్న ఓ అనుభూతిని నాకిచ్చాడు"

"ఛీ! వినడానికే అసహ్యంగా వుంది" ఛీత్కరించాడు భిక్షపతి.

"వినద్దు. నన్నొదిలేయండి. నాకు స్వేచ్ఛనివ్వండి. మీకు దండం పెడ్తాను. మీ కాళ్ళకి దండం. మీకు ఓ దండం. నన్నొదిలేయండి"

"ఛత్! దండంట దండం. నీకు రోజు అందరూ దండాలు పెడ్తున్నారు. అది గుర్తుకు తెచ్చుకో. నువ్వు పాపం చెయ్యకు. మాతోని పాపం చెయ్యనివ్వకు"

"పాపంట పాపం. మీరు చేస్తున్నదేవిటీ? మీరు నా మాట వినకపోతే నేను అందరితో చెప్పేస్తాను"

వీరయ్య చెయ్యెత్తాడు కొట్టడానికి.

"తప్పు!" అంది వీరమ్మ.

తండ్రి చెయ్యిని దించాడు భిక్షపతి.

ఒక్కసారి నిశ్శబ్దం.

వాళ్ళ ముగ్గురు వెళ్ళిపోయారు. తన మంచం మీద వాలిపోయి వెక్కి వెక్కి ఏడ్చింది. ఎప్పుడు నిద్ర పట్టిందో తెలీలేదు. హటాత్తుగా మెలకువ వచ్చి లేచింది. గదిలోంచి బయటికొచ్చింది.

తండ్రి గదిలోంచి మాటలు వినిపిస్తున్నాయి.

"దానికి ప్రేమరోగం పట్టుకుంది. ఏదో ఓ రోజున ఆ వెంకటేసుని తీసుకుని వెళ్ళిపోతుందేమో. మనం నచ్చచెప్పడం, అది వినడం ఆ స్థితి దాటిపోయింది"

"మరి యిప్పుడేవిటి మన కర్తవ్యం"

"అమ్మగార్ని అదే అమ్మోర్ని దేవతలున్న స్వర్గానికి పంపడమే మన తక్షణ కర్తవ్యం"

"ఒద్దు.. దాన్ని ఏం చెయ్యొద్దు" సన్నగా అరిచింది.

"వద్దంటే ఎలా. రేపు ఏదైనా జరిగి, ఈ రహస్యం బయట పడితే ఈ ప్రజలు మనల్ని బతకనిస్తారా? ఆమెని ఈ లోకం లోంచి పంపడమే మనందరికి మంచిది"

నిశ్శబ్దం. అందులోంచే కొన్ని వందల బాంబులు పేలినట్లుగా అనిపించింది అమ్మోరికి.

అమ్మగారి హృదయంలోంచి ఆర్తనాదాలు ఆమెకే వినిపిస్తున్నాయి. తండ్రి తమ్ముడు కలిసి తనని చంపుతారా?

తను వాళ్ళకేం కాదా? ఆ తండ్రికి తను కూతురు కాదా? వీళ్ళంతా రక్త సంబంధీకులు కారా? అసలు ఏవిధమైన సంబంధం లేదా? మరి యిన్ని రోజుల అనుబంధం కేవలం డబ్బుతో ముడివేయబడినదా? తన డబ్బుతోనేనా పని? తనతో ఏం అవసరం లేదు. తన ఉపయోగం ఏం లేదు. పనికిరాని పశువుని చంపినట్టు చంపేస్తారా?

వెళ్ళిపోవాలి. ఇక్కణ్ణించి వెళ్ళిపోవాలి. ఈ భక్తులు, ఈ భజనలు, ఉపవాసాలు వీటన్నింటికీ దూరంగా.. వెంకటేసుని తీసుకుని వెళ్ళిపోవాలి. వాళ్ళు ఏ క్షణాన్నయినా చంపచ్చు. వీలయినంత త్వరగా వెళ్ళిపోవాలి. త్వరగా ఏవిటి ఇప్పుడే...

మంచం దిగింది. దిండులో రూపాయలు తీసింది.

పళ్ళ కత్తి తీసుకుని తలవైపు పరుపుని చేత్తో తడిమి కోసింది. వెల్వెట్టు సంచిల్లో దాచిన నగలు తీసుకుంది. తన నగలే అవన్నీ. నగలు తీసి దాచినా తల్లికి తెలీలేదు. అంత బంగారం వుంది ఆమెకు. వచ్చిన వాళ్ళు తన ఒళ్ళో పడేసిన డబ్బుని తీసి దాచింది. అది కూడా తండ్రికి తమ్ముడికి తెలీకుండా. తెలిసినా పెద్దగా పట్టించుకోలేదు. అన్నీ ఓ చేతి సంచిలో సర్దుకుంది.

తలుపు తీసింది.

ఎదురుగా తండ్రి, తమ్ముడు.

తమ్ముడి చేతిలో గొడ్డలి. తండ్రి చేతిలో గోనె సంచి.

అర్థం అయిపోయింది. ఒక్కసారి వెనక్కి వెళ్ళింది.

"నన్ను చంపద్దు. నన్ను చంపకు..." ఒక్కసారి తల వెనక్కి వంచి నోట్లో కుక్కిన బట్ట వెనకాల మాటలు వుండిపోయాయి. పారిన రక్తం దీనంగా జాలిగా చూస్తూ మెల్లగా కదలలేక కదల లేక కదిలింది. దేవతలకి, స్వర్గంలో వున్న దేవుళ్ళకి ఆమె పెనుగులాట కనపళ్ళేదు. అరుపులు వినపళ్ళేదు.

మర్నాడు...

"అమ్మగారు సమాధి చెందారు" "అమ్మోరు సమాధి అయిన్రు"

అంతా ఇంటిముందున్న తాటాకు పందిరి కింద నుంచున్నారు.

"రాత్రి పదిగంటల ప్రాంతంలో అమ్మగారు నన్ను లేపారు. స్వర్గంలో పరిస్థితి చాలా అల్లకల్లోలంగా వుందని, సమాధిలోకి వెళ్ళిపోతున్నానని అన్నారు. పద్మాసనం వేసుకుని, రోజు కూచునే ఆసనం మీదే కూచున్నారు. అక్కడే సమాధి చెందారు"

వీరమ్మ ఒక్కసారి గొల్లుమంది.

"మంచి కార్యం కోసం సమాధి చెందినప్పుడు కన్నీరు పెట్టకూడదు. అమ్మోరు ఇక్కడున్న ప్రతీ వస్తువులో వున్నారు. ఈ గాలిలో వున్నారు. ఈ నీటిలో వున్నారు. ఈ ఇసుక రేణువుల్లో వున్నారు. ఆమె మనకి చూపించిన ధర్మ మార్గంలో నడవడమే మన కర్తవ్యం. ఆమె స్వర్గానికి చేరుకునే దారి సుగమం చెయ్యడానికి మనమందరం భజనలు చేద్దాం" అంటూ తెర దగ్గరికి వెళ్ళాడు పెద్దయ్యగారు. సిల్కుపంచని సవరించుకుంటూ చిన్నయ్యగారు కూడా పెద్దయ్యగారి వెనకగా వెళ్ళాడు.

సిల్కు తెర లాగారు.

వెండికోళ్ళ ఆసనం మీద అమ్మోరు లేరు. ఆవిడ ఫోటో వుంది. నిర్వికారంగా నుంచున్నారు ఆ ముగ్గురు. భజన మొదలైంది.

ఆ తర్వాత భక్తుల సంఖ్య ఏ మాత్రం తగ్గలేదు. ఆమె సమాధిని దర్శించుకోడానికి వచ్చే సంఖ్య ఎక్కువైంది.

ఏ ఏటికా ఏడు సంపదల మెట్లు ఎక్కేస్తున్నారు. ఆ యింటి ఆడవాళ్ళు బంగారు తొడుగులు చేయించుకున్నారు.

ఎవరూ కూడా ప్రాణంతో వున్న అమ్మగారి గురించి అడగడం లేదు.

ఒక్క వెంకటేసు మాత్రమే బెంగగా అమ్మగారి గదికేసి చూస్తుంటాడు. తన ఊహకందిన ఆలోచనలు చెప్పడానికి వాడు మూగవాడు. భజనల ఊపులో నిజాలు మౌనం వహించాయి.

★



### వృత్తి కళాకారుడు

ఒక విమానం కంట్రోల్ తప్పింది. పైలట్ కంగారుపడి "అందరూ సేఫ్టీ బెల్టులు గట్టిగా బిగించుకోండి, ఏ క్షణానైనా ప్రమాదం జరగొచ్చు" అని హెచ్చరించాడు. అందరూ బెల్టులు బిగించుకున్నారు కాని, ఒకాయన మాత్రం పాసింజర్ల దగ్గరికి అటు ఇటూ కలియతిరుగుతున్నాడు. పైలట్‌కి చిర్రెత్తుకొచ్చి "ఎవరాయన, పెళ్ళిలో తిరిగినట్టు తిరుగుతున్నాడు" అని ఎయిర్ హోస్టెస్‌ని అడిగాడు. "లాయర్ అనుకుంటానండీ, ఏదైనా ప్రమాదం జరిగితే అందరి కేసుల్ని తనే వాదిస్తానని పాసింజర్లతో సంతకాలు తీసుకుంటున్నాడు.